క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తాండూరు టౌన్: విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా ఆదివారం తాండూరు, వికారాబాద్ నియోజకవర్గాల్లోని పలు ప్రాంతాల్లో కరెంట్ సరఫరా నిలిపివేయనున్నట్లు తాండూరు విద్యుత్ ఇన్‌చార్జి డీఈఈ భానుప్రకాష్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 3.30 గంటల వరకు పెద్దేముల్, యాలాల, బషీరాబాద్ మండలాలతో పాటు కోట్‌పల్లి, ధారూర్, బంట్వారం మండలాల పరిధిలో సరఫరా నిలిపివేస్తున్నామని తెలిపారు. ఈ అసౌకర్యానికి చింతిస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని డీఈఈ కోరారు.

నేటి నుంచి ఈశ్వరాలయ వార్షికోత్సవం

యాలాల: ముద్దాయిపేటలో ఈశ్వరాలయ వార్షికోత్సవం ఆదివారం నుంచి ప్రారంభించనున్నట్లు ఆలయ ధర్మకర్త, ఎంపీటీసీ దేవగారి రాములు తెలిపారు. ఉదయం 6 గంటలకు గణపతి పూజ, 8 గంటలకు హోమం జరుగుతుందని చెప్పారు. అనంతరం భక్తులకు అన్నదానం ఉంటుందన్నారు. సోమవారం ఉదయం 6 గంటలకు నందికోలా, అగ్నిగుండ ప్రవేశం, స్వామివారికి అభిషేకంతో వేడుకలు ముగుస్తాయని వెల్లడించారు. వార్షికోత్సవంలో భాగంగా ఇటీవల నిర్మించిన ధర్మసత్రాన్ని ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు.

ఈటలకు సన్మానం



పరిగి: ఈటలతో పార్టీ నాయకులు

పూడూరు: ఎన్నికల ప్రచారంలో భాగంగా కర్ణాటకకు వెళ్తున్న హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్‌ను బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లేశ్ పటేల్, సీనియర్ నాయకుడు శరత్‌కుమార్ రెడ్డి, పలువురు పార్టీ నాయకులు పూడూరు గేటు వద్ద శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఈటల మాట్లాడుతూ కర్ణాటకలో వచ్చేది బీజేపీ ప్రభుత్వమేనని ఆశాభావం వ్యక్తం చేశారు. పార్టీ పటిష్టతకు ప్రతి ఒక్కరూ సైనికుల్లా పని చేయాలని సూచించారు.

ఈటలను కలిసిన భూనేటి

పరిగి: బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్‌ను ఆ పార్టీ రాష్ట్ర కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు, నియోజకవర్గ ఇన్‌చార్జి మారుతి కిరణ్ భూనేటి శనివారం పరిగిలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. కర్ణాటక ఎన్నికల ప్రచారానికి ఈటల వెళ్తున్న క్రమంలో కిరణ్ ఆయన్ను కలిశారు.

లేబర్‌కార్డు ఉన్నవారికి ఉచిత వైద్యం

కుల్కచర్ల: లేబర్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ 50రకాల వైద్య సేవలు ఉచితంగా అందిస్తామని జన్ సహాస్ స్వచ్ఛంద సంస్థ ప్రకాష్‌కుమార్ తెలిపారు. శనివారం చెల్లాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలో నిర్వహించిన హెల్త్ క్యాంపులో ఆయన మాట్లాడారు. భవన నిర్మాణ రంగంలో పనిచేస్తున్న కార్మికులు, కూలీలందరూ లేబర్ కార్డులు పొందాలని, కార్డు కలిగి ఉన్న వారందరికీ ఉచితంగా వైద్యపరీక్షలు, చికిత్సలు నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో హెల్త్ క్యాంపు కోఆర్డినేటర్ వాజిద్, జన్ సహాస్ సంస్థ కోఆర్డినేటర్ వంశీ, రవి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.


15 నుంచి క్రీడా పోటీలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ

దౌల్తాబాద్: ఈ నెల 15 నుంచి 17 వరకు మండల కేంద్రంలో చీఫ్ మినిస్టర్స్–2023 పేరిట మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహించబడతాయని ఎంపీపీ విజయ్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ టోర్నీలో 15 నుంచి 36 ఏళ్ల యువతీ, యువకులు పాల్గొనవచ్చని, ఆసక్తి ఉన్న వారు 11వ తేదీ వరకు ఎంపీడీఓ కార్యాలయంలో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ తిరుమలస్వామి, తహసీల్దార్ కృష్ణయ్య, జీహెచ్‌ఎం ఊషన్న ఉన్నారు.

శ్మశాన వాటిక ఆధునికీకరణ



కొలతలు తీసుకుంటున్న ఏఈ

కొడంగల్: పట్టణంలోని హిందూ శ్మశాన వాటిక ఆధునికీకరణకు శనివారం అధికారులు కొలతలు తీసుకున్నారు. స్నానపు గదులు, మరుగుదొడ్లు, దహన వాటిక, వెయిటింగ్ హాల్, వాటర్ ట్యాంకు తదితర నిర్మాణాలకు మార్కింగ్ ఇచ్చారు. త్వరలో పనులు చేపట్టనున్నట్లు మున్సిపల్ ఏఈ ఖాజా, రెండో వార్డు కౌన్సిలర్ మధుయాదవ్ తెలిపారు.

పరిహారం కోసం పడిగాపులు

వడగళ్ల వానతో యాసంగి పంటలు తుడిచి పెట్టుకుపోయి నష్టపోయిన రైతులు ప్రభుత్వం ప్రకటించిన పరిహారం కోసం పడిగాపులు కాస్తున్నారు. ఆదుకుంటామని హామీ ఇచ్చి 40 రోజులు గడిచినా సాయం ఊసు లేకపోవడంతో అన్నదాతలు దిగాలు చెందుతున్నారు.

- వరుస వడగళ్లతో రైతుల విలవిల
- రెండు దఫాలుగా పంటలు కోల్పోయామంటూ కన్నీరుమున్నీరు
- సర్కారు సాయం చేయాలంటూ వేడుకోలు



బొప్పాయి తోటను పరిశీలిస్తున్న ఎంపీ రంజిత్‌రెడ్డి తదితరులు(ఫైల్)

మోమిన్‌పేట: అకాల వర్షాలతో చేతికందొచ్చిన పంటలు దెబ్బతిని, పెట్టుబడితోసహా నష్టపోయిన రైతులకు.. ఎకరాకు రూ.10 వేల పరిహారం ఇచ్చి ఆదుకుంటామని రాష్ట్ర ప్రభుత్వం భరోసా ఇచ్చింది. అందులో భాగంగా జిల్లాలకు ఆ సొమ్మును పంపిణీ చేస్తున్నామని ప్రకటించింది. కర్షకుల ఖాతాల్లో డబ్బులు జమచేస్తామని హామీ ఇచ్చింది. కానీ ఇప్పటి వరకు జాడ లేదని రైతులు వాపోతున్నారు. పక్షం రోజుల క్రితం జిల్లా అధికారులు వారం రోజుల్లో నష్టపరిహారం సొమ్ము బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తామని పేర్కొన్నప్పటికీ.. నేటికీ దిక్కు లేదని ఆరోపిస్తున్నారు.

వరుస విపత్తులు

మార్చి 16,18 తేదీల్లో వడగళ్ల వర్షానికి జొన్న, మొక్కజొన్న, కూరగాయ పంటలు, ఉల్లి, బొప్పాయి, అరటి తోటలు, పౌల్ట్రీ ఫామ్స్ దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోయారు. పుచ్చ, తర్బూజ తదితర పంటలు చేతికి రాకుండా పోగా.. ప్రజాప్రతినిధులు బాధితులను ఓదార్చి ఆదుకుంటామని భరోసా ఇచ్చి వెళ్లిపోయారు. కానీ ఇప్పటి వరకు ఆ పరిహారం అందలేదు. ఏప్రిల్ 25న మరోసారి వడగండ్లు విరుచుకుపడి వరి, పూలు, జొన్న, మునగ పంటలు దెబ్బతిని రైతులను కోలుకోలేని దెబ్బ తీశాయి. ఇలా వేసవిలో సాగు చేసిన ప్రతి పంట చేతికి రాకుండా.. అకాల వర్షాలకు తుడిచిపెట్టుకుపోతున్నాయని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. పెట్టుబడులు రాకుండా పోయాయి. ప్రభుత్వం ఇచ్చే పరిహారం సరిపోకున్నా.. కొంత ఊరట కలిగిస్తుందని అన్నదాతలు ఎదురు చూస్తున్నారు. ఇదిలా ఉండగా.. మండల పరిధి గ్రామాల్లో రెండు దఫాలుగా పంట నష్టం అంచనా వేయగా.. 689 ఎకరాల్లో జొన్న, మొక్కజొన్న, కూరగాయలు, బొప్పాయి, అరటి, పూలు తదితర పంటలు నష్టపోయి.. సుమారు 610మంది రైతులు సర్కారు సాయం కొరకు ఎదురు చూస్తున్నారు.

రెండు ఎకరాల్లో..



ఒక ఎకరాలో పుచ్చ, మరో ఎకరాలో తర్బూజ సాగు చేశాను. అందుకు రూ.40 వేల పెట్టుబడి అయింది. ఇంకొక రోజైతే మార్కెట్‌కు తరలించే వాన్ని. అంతలోనే వడగళ్ల వాన విరుచుకుపడి పంటను నేలపాలు చేసింది. ఉద్యాన శాఖాధికారులు పంట నష్టం అంచనా వేశారు. కానీ ఇప్పటి వరకు పరిహారం అందలేదు.

– బాబుమియా, రైతు, ఎన్కేపల్లి

రూ.లక్ష పెట్టుబడి



రెండు ఎకరాల్లో టమాటా సాగు చేశా. రెండు కోతలు మాత్రమే అయ్యాయి. రూ.లక్ష పెట్టుబడి పెట్టాను. బెడ్ తయారు చేసి, మల్చింగ్ వేసి ట్రేకింగ్ చేయడం వలన కాపు బాగానే వచ్చింది. కానీ ప్రకృతి కన్నెర్ర చేయడంతో పంట నేల పాలయింది. ప్రభుత్వం ఇస్తామన్న నష్టపరిహారం అందలేదు.

– మానిక్‌రెడ్డి, రైతు, సయ్యద్‌అల్లిపూర్

త్వరలోనే పరిహారం..



త్వరలోనే పంట నష్ట పరిహారం రైతుల బ్యాంకు ఖాతాలో జమ చేయడం జరుగుతుంది. వరుస వర్షాలు పడుతుండటం వలన పంట నష్టాన్ని అంచనా వేస్తున్నాం. ఇప్పటికీ రెండు దఫాలుగా అంచనా వేశాం. పూర్తి స్థాయి నివేదిక పంపించాం. 610మంది రైతులు, 689 ఎకరాల్లో వివిధ రకాల పంటలు నష్టపోయాయి.

– జయశంకర్, ఏఓ, మోమిన్‌పేట

కేసీఆర్ సార్ పైసలు ఇస్తలేరు

- సర్పంచులు సహకరించాలి
- మండల సభలో ఎంపీడీఓ పాండు
- వారించిన ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్



మాట్లాడుతున్న ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్

కొడంగల్: 'కేసీఆర్ సార్ పైసలు ఇస్తలేరు. సర్పంచులు సహకరించాలి' అని ఎంపీడీఓ పాండు అన్నారు. శనివారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన జరిగిన మండల జనరల్ బాడీ మీటింగులో పలువురు సర్పంచులు చేసిన పనుల బిల్లులు, ఈజీఎస్, కంటివెలుగు, పెండింగ్ బిల్లుల విషయంపై ప్రశ్నించగా.. పై విధంగా ఎంపీడీఓ సభ్యులకు చెప్పారు. దీంతో ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్ జోక్యం చేసుకొని ప్రభుత్వాన్ని కించపరిచే విధంగా మాట్లాడొద్దని వారించారు. ఇదే అంశంపై ఉపాధిహామీ ఏపీఓ రాములు మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి బడ్జెట్ రావడం లేదని, ఈజీఎస్ ద్వారా చేసిన పనులకు బడ్జెట్ వచ్చిన తర్వాత బిల్లులు చెల్లిస్తామని చెప్పారు. ఎంపీటీసీ రాములు మాట్లాడుతూ టేకుడ్‌కోడ్ గ్రామ పంచాయతీ కార్యదర్శి డబ్బులు తీసుకొని ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని సభ దృష్టికి తీసుకురాగా.. ఎంపీపీ మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శిపై విచారణ చేపట్టి, నివేదిక ఇవ్వాలంటూ పంచాయతీ అధికారిని ఆదేశించారు. ఇదిలా ఉండగా.. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున ధాన్యం కొనుగోలును వేగవంతం చేయాలన్నారు. సమావేశంలో ఎంపీడీఓ పాండు, పీఆర్, ఇరిగేషన్, రెవెన్యూ, ఈజీఎస్, ఆర్‌డబ్ల్యూఎస్‌తో పాటు పలు శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



ఖాతాదారులకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ రవిగౌడ్

కొడంగల్ రూరల్: బ్యాంకు ఖాతాదారులు, ప్రజలు సైబర్ నేరాలు, గుర్తు తెలియని వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ రవిగౌడ్ సూచించారు. శనివారం పట్టణంలోని ఎస్‌బీఐ బ్యాంకులో బ్యాంకు మేనేజర్ కిరణ్‌కుమార్‌తో కలిసి ఖాతాదారులకు అవగాహన కల్పించారు. ఓటీపీలు, బ్యాంకు లోన్లు తదితర వాటిపై గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేస్తూ డబ్బులు దండుకునేందుకు ప్రయత్నం చేస్తారని, వాటికి స్పందించవద్దని సూచించారు. ఫోన్లలో వచ్చే లింకులను ఓపెన్ చేయరాదని, లోన్లు ఇస్తామని, ఓటీపీ చెప్పాలని బ్యాంకు సిబ్బంది అడిగే ప్రసక్తే లేదని, ఓటీపీ చెప్పి మోసపోవద్దని చెప్పారు. కార్యక్రమంలో బ్యాంకు, పోలీసు సిబ్బంది, ఖాతాదారులు పాల్గొన్నారు.

జేపీఎస్‌లను రెగ్యులరైజ్ చేయాలి

పీసీసీ ఉపాధ్యక్షుడు రమేష్ మహరాజ్



తాండూరు రూరల్: జేపీఎస్‌ల సమ్మెలో మాట్లాడుతున్న రమేష్ మహరాజ్

తాండూరు రూరల్: జూనియర్ పంచాయతీ కార్యదర్శులను ప్రభుత్వం వెంటనే రెగ్యులరైజ్ చేయాలని పీసీసీ ఉపాధ్యక్షుడు రమేష్ మహరాజ్ డిమాండ్ చేశారు. శనివారం తాండూరు ఎంపీడీఓ కార్యాలయం వద్ద జేపీఎస్‌లు నిర్వహిస్తున్న సమ్మెకు ఆయన మద్దతు తెలిపి మాట్లాడారు. జేపీఎస్‌లతో ప్రభుత్వం వెట్టిచాకిరీ చేయిస్తుందని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే జేపీఎస్‌ల సమస్యలు పరిష్కరిస్తామని చెప్పారు. కార్యక్రమంలో పెద్దేముల్ జెడ్పీటీసీ ధారాసింగ్, సీనియర్ నాయకులు రాకేష్ మహరాజ్, జనార్దన్‌రెడ్డి, నర్సింహులు, పంచాయతీ కార్యదర్శుల సంఘం ప్రతినిధులు లాలప్ప, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

సంఘీభావం

కొడంగల్: జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సమ్మెకు ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్ సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జేపీఎస్‌లను వెంటనే పర్మినెంట్ చేయాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచులు పకీరప్ప, శంకర్‌నాయక్, మాజీ సర్పంచ్ రమేష్‌బాబు పాల్గొన్నారు.

9వ రోజుకు చేరిన సమ్మె

అనంతగిరి: పర్మినెంట్ చేయాలని కోరుతూ జేపీఎస్, ఓపీఎస్‌లు చేస్తున్న నిరవధిక సమ్మె శనివారానికి 9 రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శులు మాట్లాడుతూ తమ సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

సంఘర్షణ సభను విజయవంతం చేయండి

మాజీమంత్రి ప్రసాద్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి ప్రసాద్‌కుమార్

అనంతగిరి: హైదరాబాద్ సరూర్‌నగర్ స్టేడియంలో సోమవారం నిర్వహించే యువ సంఘర్షణ సభను విజయవంతం చేయాలని మాజీమంత్రి ప్రసాద్‌కుమార్ కోరారు. శనివారం వికారాబాద్‌లోని తన నివాసంలో పార్టీ నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగే ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఏఐసీసీ నాయకురాలు ప్రియాంకగాంధీ రానున్నారని చెప్పారు. కావున నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ శ్రేణులు, నిరుద్యోగ యువత పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ సత్యనారాయణ, మాజీ ఎంపీపీ నర్సింహులు, మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు కిషన్‌నాయక్, పార్టీ మండలాల అధ్యక్షులు రాజశేఖర్‌రెడ్డి, శంకర్, రవి, వెంకటేషం, కౌన్సిలర్ మురళీ, ఆసిఫ్, యూత్ జిల్లా అధ్యక్షుడు సతీష్‌రెడ్డి, సీనియర్ నాయకలు జాఫర్, కిష్టారెడ్డి, రఘుపతిరెడ్డి, శ్రీనివాస్, సంతోష్ పాల్గొన్నారు.

నిరుద్యోగ సమస్య పట్టని ప్రభుత్వాలు

దౌల్తాబాద్: ఈ నెల 8న హైదరాబాద్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించే నిరుద్యోగ నిరసన ర్యాలీకి యువత పెద్ద సంఖ్యలో తరలి వచ్చి జయప్రదం చేయాలని మాజీ వైస్‌ఎంపీపీ వెంకట్‌రెడ్డి కోరారు. ఈ మేరకు శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నిరసన ర్యాలీకి ప్రియాంకగాంధీ రానున్నారని తెలిపారు. యువత నిరుద్యోగంతో అల్లాడుతుంతే.. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నాయని, ఆ ప్రభుత్వాలపై పోరాడేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలన్నారు. సర్పంచ్ రెడ్యానాయక్, నాయకులు వెంకట్రాములు, మాధవరెడ్డి పాల్గొన్నారు.

పల్లెపల్లెకూ.. ఇంటింటికీ సీపీఐ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

కొడంగల్ రూరల్: పార్టీని బలోపేతం చేసేందుకు కార్యకర్తలు, నాయకులు కృషిచేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఇందనూర్ బషీర్ పిలుపునిచ్చారు. శనివారం స్థానిక కార్యాలయంలో నిర్వహించిన పార్టీ నియోజకవర్గ స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ జాతీయ సమితి పిలుపు మేరకు చేపట్టిన పల్లెపల్లెకూ..ఇంటింటికీ పార్టీ ప్రచారం చేరేలా క్షేత్రస్థాయిలో కార్యకర్తలు విస్తృత ప్రచారం చేపట్టాలని కోరారు. బీజేపీకో హఠావో.. దేశ్‌కో బచావో కార్యక్రమం చేపడుతూ పార్టీ బలోపేతానికి కృషిచేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఇంటింటికీ సీపీఐ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ కార్యదర్శి ఎండీ మహమూద్, శ్రీనివాస్, శ్యాంసుందర్, నాగేంద్రప్ప, ముస్తఫ, లక్ష్మణ్, సర్పంచ్ వెంకటయ్య, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

గుంతల రోడ్డుకు మరమ్మతులు



జేసీబీ సహాయంతో జరుగుతున్న రోడ్డు మరమ్మతు పనులు

యాలాల: లక్ష్మీనారాయణపూర్ నుంచి యాలాల మండల కేంద్రానికి వెళ్లే రోడ్డుకు అధికారులు మరమ్మతు పనులను శనివారం ప్రారంభించారు. ఈ మార్గంలో చాలా చోట్లా గుంతలు ఏర్పడి, వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడేవారు. దీంతో ఈ రోడ్డు మరమ్మతుకు సంబంధిత అధికారులు చర్యలు చేపట్టారు. గోతులు ఏర్పడిన ప్రదేశాల్లో కంకర, డస్ట్‌తో పూడ్చి, తారు వేయనున్నారు.

వేసవి శిబిరాలు విద్యార్థులకు ఉపయోగకరం



శిబిరాన్ని ప్రారంభిస్తున్న ప్రధానోపాధ్యాయురాలు సుహాసిని

దోమ: వేసవి శిబిరాలు విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడతాయని మైలారం, తిమ్మాయపల్లి పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజు, సుహాసిని అన్నారు. శనివారం ఆయా పాఠశాలల్లో సమ్మర్ క్యాంపులు ప్రారంభించి వారు మాట్లాడారు. వేసవిలో విద్యార్థుల సామర్థ్యాల పెంపే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని, ప్రతి ఒక్కరికీ పుస్తక పఠనం, ఆటలు ఆడటం, బొమ్మలు గీయడం, కథలు నేర్చుకోవడం వంటి ఎన్నో విషయాలను నేర్పిస్తున్నామని చెప్పారు. కావున ప్రతి విద్యార్థి ఈ శిబిరాలను వినియోగించుకునేలా తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచులు రాజు, అర్చన, ఉపసర్పంచులు నర్సింహులు, లక్ష్మయ్య, స్కూల్ చైర్మన్లు గోవర్ధన్, బాబయ్య, సీఆర్‌పీలు వెంకటేశ్, సతీష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ స్థానాన్ని క్రైస్తవులకు కేటాయించాలి

తాండూరు టౌన్: ఒక ఎమ్మెల్సీ స్థానాన్ని క్రైస్తవులకు కేటాయించాలని తెలంగాణ యునైటెడ్ క్రిస్టియన్స్ అండ్ పాస్టర్స్ అసోసియేషన్ తాండూరు చీఫ్ కోఆర్డినేటర్ రెవరెండ్ అశోక్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో సీఎం కేసీఆర్‌ను కోరారు. అసోసియేషన్ చీఫ్ సెక్రటరీ గోనె సాలోమోన్ రాజుకు ఎమ్మెల్సీగా అవకాశం కల్పించాలన్నారు. క్రైస్తవులకు క్రిస్టియన్ మైనార్టీ కార్పొరేషన్ ద్వారా ప్రభుత్వం ఉపాధి కల్పించడం అభినందనీయమన్నారు.

భరోసా సభను విజయవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న రాజు

మర్పల్లి: బీఎస్పీ ఆధ్వర్యంలో హైదరాబాద్ సరూర్ నగర్ స్టేడియంలో ఆదివారం నిర్వహించనున్న తెలంగాణ భరోసా సభను విజయవంతం చేయాలని ఆ పార్టీ వికారాబాద్ అసెంబ్లీ అధ్యక్షుడు తలారి రాజు పిలుపు నిచ్చారు. శనివారం పార్టీ స్థానిక కార్యాలయంలో కార్యకర్తలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సభకు ముఖ్య అతిథిగా పార్టీ జాతీయ అధ్యక్షురాలు మాయావతి, రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్, జాతీయ, రాష్ట్ర నాయకులు హాజరుకానున్నారని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, ప్రధానకార్యదర్శి ప్రభాకర్, ఉపాధ్యక్షుడు హర్షవర్ధన్, మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడు సయ్యద్ అమీర్, సోషల్ మీడియా మండల ఇన్‌చార్జి నరేష్ పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం

యాలాల: జక్కేపల్లి గ్రామానికి చెందిన కుర్వ బాజారప్ప(65)శుక్రవారం సాయంత్రం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఆర్‌బీఎల్ కర్మాగారం ఎండీ శ్రీనివాస్‌రెడ్డి మృతుడి కుటుంబానికి స్థానిక ఉపసర్పంచ్ మహిపాల్, గణేశ్, మల్లేషంతో కలిసి ఆర్థిక సహాయం అందజేశారు.

వీధి నాటకాలను ప్రోత్సహించాలి

దోమ: వీధి నాటకాలను ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలని బీజేపీ నాయకుడు, కేఎస్ఆర్ ట్రస్ట్ చైర్మన్ శరత్‌కుమార్ రెడ్డి అన్నారు. శుక్రవారం రాత్రి దోమ మండల పరిధిలోని కొత్తపల్లిలో ప్రదర్శించిన భక్తి సిరియాల వీధి నాటకాన్ని ఆయన వీక్షించి మాట్లాడారు. గ్రామాల్లో నాటకాలు ప్రదర్శించడం ఎంతో గర్వంగా ఉందన్నారు. అనంతరం కళాకారులకు రూ.11 వేల ఆర్థిక సహాయం చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకుడు అజయ్‌కుమార్ రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి మల్లేశం, బూత్ కమిటీ గ్రామ అధ్యక్షుడు మల్లయ్య, బీజేపీ నాయకులు మాధవులు, రాజు, కురుమయ్య, యాదగిరి, హన్మంతు, వెంకట్‌రాములు, శ్రీనివాస్, దాసు తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ పాలనతో తెలంగాణకు అన్యాయం



సమావేశంలో మాట్లాడుతున్న లాహోటీ

కొడంగల్: ముఖ్యమంత్రి కేసీఆర్ కుటుంబ పాలనలో తెలంగాణకు అన్యాయం జరిగిందని బీజేపీ సీనియర్ నాయకుడు పున్నం చంద్ లాహోటీ ఆరోపించారు. శనివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తుందన్నారు. అవినీతి రహిత పాలన అందించడమే తమ పార్టీ లక్ష్యమని, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీపై ప్రజలకు విశ్వాసం ఉందని, రాష్ట్రంలో, కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మోహన్‌రావ్, బాబయ్య నాయుడు, సర్వేష్, లక్ష్మయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' కూలీలకు అందని కూలి

బంట్వారం: కోట్‌పల్లి మండలం ఇందోల్ గ్రామంలో ఉపాధిహామీ కూలీలకు ఐదు వారాలుగా కూలి డబ్బులు అందడం లేదని పలువురు కూలీలు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కొందరికి రోజుకు రూ.30 నుంచి రూ.50 చొప్పున మాత్రమే కూలి డబ్బులు ఖాతాలో జమ అయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. రోజుకు రూ.270 రావాల్సి ఉండగా, ఇంత తక్కువగా ఎలా జమచేస్తారని కూలీలు ప్రశ్నించారు. సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకొని న్యాయం చేయాలని కోరారు.

సూచిక బోర్డులు లేక.. తికమక



బురాన్‌పూర్, ముద్దాయిపేట గ్రామాల కూడలిలో బోర్డు ఉన్నా.. కనిపించని సమాచారం

బొంరాస్‌పేట: రహదారుల్లో సూచిక బోర్డులు లేక వాహనదారులు తికమక పడుతున్నారు. బొంరాస్‌పేట, దుద్యాల మండలాల పరిధిలో రోడ్ల మలుపులు, ఇరువైపులా రహదారులు వేరుచేసే ప్రదేశాల్లో దిక్సూచి లేకపోవడంతో ఎటువెళ్లాలో తెలియక దిక్కులు చూస్తున్నారు. పరిసర ప్రాంత వాసుల సంగతి ఎలా ఉన్నా.. కొత్తవారికి దారితెన్నులు తెలియని పరిస్థితి. మండల కేంద్రం శివారులోని పెంట్రోల్ బంక్ వద్ద నేరుగా మెట్లకుంట వైపు, అలాగే ఎడమ దిక్కు వివిధ గ్రామాలకు వెళ్లే దారి ఉంది. అదే విధంగా గ్యాస్ ఏజెన్సీ దాటిన ప్రదేశం వద్ద ఎడమ దిక్కు ముద్దాయిపేట, కుడి పైపు బురాన్‌పేర్, మదన్‌పల్లి గ్రామాల మీదుగా వెళ్లేందుకు రహదారి ఉంది. దుద్యాల మండల కేంద్రం నుంచి లగచర్ల, హకీంపేట గ్రామాలకు వెళ్లే చోట, లేని ప్రదేశాల్లో ప్రాంతాల పేరు, వాటి కి.మీ. తెలిపే బోర్డులు ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.